సుఖం ఎరుగని

జీవితం

సింగరాజు
చంద్రశేఖరరావు

“వెరైటీ చౌకు” వైపుగా నడుస్తున్నాను.

‘రాజా !’ పరిచయ కంఠం వినిపించేసరికి గబుక్కున వెనక్కు తిరిగాను.

నవ్వుతూ, ఎదురుగా కనిపించింది పెన్ని కూతురు పార్వతి !

ఆశ్చర్యంతో స్తబ్దుడనయ్యాను. ప్రెసిడెంటు కెనడీ దారుణంగా హత్యగావించ బడ్డాడని ప్రముఖ దిన పత్రికలు ఘోషించిననాడుగాని, అనుకోని అదృష్టము మిత్రుడు భాస్కరాన్ని వరించిన నాడుగాని అంతగా ఆశ్చర్య పడలేదు కాని ఇప్పుడు — ఈ క్షణంలో — ఆశ్చర్యపడుతున్నాను. కారణం — పెన్నికూతురు పార్వతిని ఈ ప్రాణాల్లో చూడటమే.....

నన్ను నేను నమ్మలేని స్థితిం వచ్చాను.

నిత్య జీవితంలో ఇలాంటి సందర్భాలు, సన్నివేశాలు సంభవించడం సహజమని తెలుసుకునే వయస్సులో ఉండి కూడ ఆ విధంగా తబ్బిబ్బు కావడం అనేది చెప్పుకోతగ్గ విశేషం !

‘ సందేహం లేదు. ఆమె పార్వతే ! ’

మనిషి లావెక్కినా ఆమెలో వెనుకటి పోలికలు ఇంకా మాసిపోలేదు.

యాంత్రికంగా ముందుకు నడిచాను.

నిశితంగా ఆమెను ఆపాదమస్తకం పరిశీలించడం తప్ప అప్పట్లో మరింకేమీ చేయలేక పోయాను.

“ అన్నయ్యా ! నేను పార్వతిని గదట్రా.... మరి, అట్లా చూస్తావ్ ? ...... పరాయి మనిషిలా ! ” చిరునవ్వు చిందిస్తూ పార్వతి అనేసరికి ఈలోకం లోకి వూడిపడ్డాను. పార్వతి ఎర్రగా, బొద్దుగా, చక్కగా ఉంది.

“ నువ్వా పార్వతీ ! .... ఎంతగా మారి పోయావ్ ? .... గుర్తు పట్టలేదంటే నమ్ము ! ” ఆపుకోలేని ఆనందంతో గబ, దబ మాట్లాడేశాను.

నాగపూర్ విద్యార్థి సంఘం నిర్వహించిన కథల పోటీలో మొదటి బహుమతి పొందిన కథ.

" ఆవరయ్యా బాబూ ! ఆవు .... నీతో ఏమొచ్చినా కష్టమే -- ఒట్టి కంగారు మనిషివి....... సరే............ ఈ కబుర్లకేంగాని, నీముందున్న పెద్దమనిషి ఎవరో తెలుసు కున్నానా ? ...., నువ్వెవరివో ఆయనకు తెలుసా ?....... అందుకే అన్నారోయ్ — మనని ఆంధ్రులమని ! " చిలిపిగా నవ్వుతూ ఆయన వంక చూసింది

అప్పటికిగాని, పార్వతి ప్రక్కనఉన్న యువకు డెవరో తెలుసుకుందామన్న అభిలాష కలుగలేదు.

" మరి పరిచయం చెయ్యి. చంపక, పెద్ద నవ్వేనవ్వా, నువ్వేనూ ! " చిరుకోపం నటించాను.

" అబ్బో ! అన్నయ్యగారిక్కి కోపం వస్తోంది బాబోలు -- వదినగారు కూడా దగ్గర లేదు." అని నవ్వి.

" వీరు శ్రీధరం — మా శ్రీవారు.

వీడు మా అన్నయ్య — రాజశేఖరం."

గౌరవపూర్వకముగా కరస్పర్శ చేశాను.

" ఇది పర్‌ఫెక్టు నార్తు ఇండియన్ స్టైలు ..... ఏమంటావ్ మేడమ్ ? ...." చిలిపిగా అంటు న్నారు. శ్రీధరం ఆమె కళ్లలోకి చూస్తూ "కరెక్టు!" అంటోంది పార్వతి ఆయన చూపులనుండి తప్పించు కుంటూ.

శ్రీధరం చొరవ చేసుకొని మాట్లాడసాగారు. పరధ్యానంగా ఇష్టంలేని సంభాషణలో తలదూర్చానన్న మాటేగాని, బుర్ర పరి, పరి విధాల పోసాగింది. అనేకమయిన గతస్మృతులు నన్ను కలవర పెట్ట సాగాయ్. ముఖ్యంగా నన్ను వేధించే ప్రశ్న ఒకటే —

"అమరేంద్ర ఏమయ్యాడు ? ..." ఆలోచన లతో సతమతమవుతూ కూడా, పార్వతి ప్రశ్నలకు సమాధానమిస్తూన్నానే కాని మనసు అక్కడలేదు.

" మీరేం చేస్తున్నారు ? " శ్రీధరంగారి ప్రశ్న.

" ఎం. ఏ. చదువుతున్నాను — ఎల్. ఎ. డి. కాలేజీలో ! " ఆలోచించకుండానే తపీమని సమాధాన మిచ్చాను. శ్రీధరం పెద్ద పెట్టున నవ్వారు.

" వండ్రఫుల్ ! అన్నయ్యా, అమ్మాయిల కాలే జీలో అబ్బాయికి ...... అందులోనూ .... ఎం. ఏ.లో సీటు ఇచ్చారా ? ..... భలే. భలే .... ఏం, నీమనసు ఇక్కడ లేదేంటి ? — వదినగారి యోగక్షేమములు గట్రా తెలుస్తున్నయ్యా లేక వన్ వే ట్రాఫిక్కా : .." చురుకుగా నావంక చూసి.

" నయం, ' సరస్వతీ విద్యాలయం 'లో ఏదో క్లాసు చదువుతున్నావేమో, కొంపదీసి జ్ఞాపకం చేసుకో " కిల, కిలా నవ్వేసింది పార్వతి.

అప్పటికి తెలిసింది నాతప్పు. పరధ్యానకు నన్ను నేను తిట్టుకొని వాళ్ళతో మాటలు కలిపాను.

" ' వదినా ' ' వదినా ' అని పట్టించావేమిటి?.. నాకింకా పెండ్లికుదరలేదు తెలుసా ! " అన్నాను కళ్ళు పెద్దవి చేస్తూ

"మైగాడ్! ఈజ్ ఇట్? .... అయితే మంచి వదినను వెతుకుతానులే .... ఐవిమాస్ ......ఇక్కడ కాదు — మనదేశంలో ! " చిలిపి పిల్ల పార్వతి ! తను నవ్వుతుంది, ఇతరులను నవ్విస్తుంది. ముగ్గురం ' రెస్టారెంటు 'లో కాఫీ త్రాగాము. శ్రీధరంగారు ' సిగిరెట్ ' కొరకై బయటకు వెళ్ళారు.

" పారూ ! అమరేంద్ర ఏమయ్యాడు ? ..." సందేహానివృత్తికై సాధ్యమయినంత తగ్గుస్థాయిలో అడిగాను. వెంటనే పార్వతిలో మార్పు రావడం గమ నించాను. ఆమె ముఖం నల్లబడింది. కళ్ళు చెమ్మగిల్లి నాయ్. అప్రయత్నంగా ఆమె కన్నీటి బొట్టు నా పాదాలమీద పడింది. ఆకస్మిక సంఘటనకు అదిరిపోయాను. కాని తమాయించుకొని.

" అదేమిటి పారూ, ఏడుస్తున్నావా ? ... ఛా ! తప్పుకదూ ! నువ్వు ఒకప్పుడు అన్నావు గుర్తుందా — 'పుట్టింది అమ్మాయిలా, అంగునప్పటికి బెంబేలు పడి నివారించవని మరి ఈ కన్నీళ్ళకు అర్థం ?...." సముదాయింపు ధోరణిలో అన్నాను.

పార్వతి జీరబోయిన గొంతుకతో " వద్దు రాజా ! ఎందుకు నాచేత చెప్పిస్తావ్ ? .... ఒకనాటి నానిర్ల క్ష్యపు చేష్టలకు బలి అయ్యాడు అమరేంద్ర. పాపం., మొన్ననే తెలిసింది ఆతనికి పిచ్చి ఎక్కిందట" పెద్ద రాయితో నెత్తిమీద కొట్టినట్లుగా ఫీల య్యాను. గుడ్లప్పగించి చూడటం తప్ప ఆలోచనా శక్తి నాలో నశించింది. ప్రాణమిత్రుడు, సహృద యుడు అయిన అమరేంద్రకు పిచ్చి ఎక్కడానికి మూర్తీభవించిన కారణం పార్వతి ! పార్వతిని ఏమి చేసినా పాపం లేదన్నంత కోపం వచ్చింది. ఆమెను చూడాలంటే చాలా అసహ్యం వేసింది. ఆవేశంతో అన్నాను......

" మంచీ, చెడూ యోచన కలిగిన మానవుడెవ్వడూ నీ ప్రవర్తనను హర్షించలేడు. పార్వతీ ! — అమాయ కుడ్ని నాశనం చేశావ్. — నిన్ను భగవంతుడు క్షమించడు."

" క్షమించరా, అన్నయ్యా ! సమయము వచ్చి నప్పుడు సవిస్తరముగా చెబుతా కాని, ఆవిషయములు ఆయనకడ ఎత్తి వచ్చటి నా సంసారంలో చిచ్చు పెట్టవని ఆశిస్తున్నాను." అంతటి కోపంలోనూ పార్వతిని చూశాను. దీనంగా ఆమె తలవంచుకొంది. జల, జల కన్నీళ్లు ప్రవహిస్తున్నాయి. ఎందుకో ఆమెపై అమితమయిన జాలి కలిగింది. తప్పు చేసినా, చెల్లెలి జీవితంతో చెలగాటమాడుటకు మనస్సంగీ కరించలేదు. క్రమంగా కోపం చల్లారింది.

" నీ సుఖం కంటే ఎక్కువగా ఆశించేది ఏదీ లేదు పారూ — నన్ను పూర్తిగా నమ్ము ! " ఆప్యా యంగా ఆమె భుజంపై చెయ్యి వేశాను.

" నాకు తెలుసు, నువ్వు మా రాజన్నయ్యవు కదూ ! " నిండుగా నవ్వింది పార్వతి. కన్నీళ్ళు పైట చెంగుతో తుడుచుకుంటూ.

తృప్తిగా ఆమెవంక చూశాను.

ఇంతలోకి శ్రీధరంగారు వచ్చారు.

" నాగపూర్ గురించి మీ అభిప్రాయం ? " విలాసంగా పొగ వదులుతూ ప్రశ్నించారు శ్రీధరం.

" అందమయిన నగరం " తాపీగా అన్నాను.

" మీతో పూర్తిగా ఏకీభవించ నప్పటికీకొంత వరకు ఒప్పుకుంటాను — కలకత్తాలాంటి ' డర్టీ ' నగరాల కంటే చాలా మెరుగు నయం — పరి శుభ్రత విషయంలో " ఆయనే అన్నారు.

" ఇక్కడ స్త్రీకి చాలా విషయాలలో మన ప్రాంతాలలో కంటే ఎక్కువ స్వాతంత్ర్యము ఉంది. కాని చెప్పుకో తగ్గ విశేషం ఏమంటే ఆమె తన స్వేచ్ఛను చెడుమార్గాలలో వినియోగించుకోదు."

నిజమేనని ఒప్పుకున్నాను. బజారు వైపుగా చూశాను. రెండు జడల మరాఠీ అమ్మాయిలు జంటలుగా సైకిళ్ళమీద వెళుతున్నారు.

అదే వైపుగా చూస్తున్న శ్రీధరం " చూడండి, స్త్రీలు కూడా విచ్చలవిడిగా సైకిళ్ళమీద పోతుం టారు. అది ఆంధ్రదేశంలో మచ్చుకైనా కనిపించదు. అని " బావగారూ, మీ చెల్లెలి 'అద్దె గుర్రం ' స్టోరీ వింటారా ? ...... అదో పెద్ద గాథలెండి..." ఈమెగారు నేర్చుకుందామని కుస్తీపట్టిన సైకిలు ముచ్చటగా మూల బడింది. షాపువాడు ఒకటే గోల. వోదార్చలేక చచ్చాను అనుకోండి " శ్రీధరంగారు పెద్దగా నవ్వారు.

" పచ్చి అబద్ధం ! — సైకిలుకేం నిక్షేపంలా వుంది. కావాలంటే మిమ్మల్ని కూడా ఎక్కించుకొని తొక్కగలను తెలుసా ! " పార్వతి అంది కళ్ళు పెద్దవి చేస్తూ.

" ఆ పని మాత్రం తలపెట్టకు పుణ్యం ఉంటుంది " ముగ్గురం నవ్వాము.

కొంతసేపు మాట్లాడిన తరువాత, శ్రీధరం గారు రిక్షా మాట్లాడుతున్నారు. పార్వతి వెళ్లడానికి ఉద్యుక్తురాలయింది. ఆయన వాళ్ల ఇంటి అడ్రసు నాకు ఇచ్చి నన్ను రమ్మని ఆహ్వానించారు.

" ఒరేయ్ ! అన్నయ్యా ! నేను ఆదివారం ఎని మిది గంటలకు — ఉదయం — నీ కొరకై మా వాకిట్లో నిలబడి ఉంటాను — రిసీవ్ చేసుకొనే పోజులో. శ్రీవారు పేపరు చదువుతూ ప్రక్కనే కూర్చుని ఉంటారు. అట్టి సమయమున నీవు మా ఇంటికి .... అనగా ... అడ్రసులో ఇవ్వబడిన ' ప్లాటు ' నకు రావాలి — అంతే ! లేకపోతే తెలుసుగా. నా సంగతి . . సోమవారం నీ 'రూం' ముందు సత్యా గ్రహం. పికెటింగు వగైరా, వగైరా .... గుర్తుంచుకో " పార్వతి నవ్వుతూ రిక్షా ఎక్కింది. పోతున్న ఆ దంపతులను చూస్తూ నిలబడ్డాను.

అన్యోన్యమయిన దాంపత్యం — ఈడూ, జోడూ — చూడదగిన జంట !

" కాని అమరేంద్ర ...." వెనుకటి ఆలో చనలు నన్ను కలవర పెట్టసాగాయి.

" నడిచిన చరిత్రలో పార్వతి తప్పు చేసిందా ? .... ఆతనిని వదిలి రావలసిన అగత్యం ?"

వేధించుచున్న ప్రశ్న. అనేక ప్రశ్నలకు తావి స్తోంది. అప్రయత్నంగా పార్వతిపై కోపం వచ్చింది.

" రేపు శ్రీధరంను కూడా అట్లాగే చేస్తుం దేమో ? ...."

మొదటి నుంచి పరిస్థితులను అర్థం చేసుకుని, సంఘంలో తన స్థానమును గుర్తించుకొని నడిచే స్వభావము కాదు. పార్వతి భగవంతుని కూడా లక్ష్య పెట్టదు. ' పెంకితనానికి ' నిర్లక్ష్యానికి ఆమె మారు పేరు ....

భోజనం చేసి ' రూం ' లో పట్టె మంచంమీద కూర్చుని ఆలోచిస్తున్నాను.

పార్వతి ..... శ్రీధరం .... అమరేంద్ర. శ్రీధరం గురించి నాకేం తెలియదు — పార్వతి భర్త అని తప్ప.

స్నేహితునుంటే ప్రాణమిచ్చే ఆప్తమిత్రుడు అమరేంద్రను చెడు దృష్టిలో ఆలోచించడానికి మనస్కరించలేదు. నవనీతం లాంటివాడు అమరేంద్ర. ఆతని వ్యక్తిత్వమునకు తప్పుడు అర్థం చెప్పుకోవడం, నానుండి కాని పని. ' రూం 'మేటుగా డిగ్రీ క్లాసులో ఆతని హృదయ వైశాల్యతను గమనించ గల్గాను. అతి సున్నితమయిన మనస్తత్వం అతనిది. ఇక. పార్వతి స్వభావం అగ్రం కాలేదు తల్లీ, దండ్రీ లేరని అల్లారు ముద్దుగా పెంచిన మామయ్య



ఆనందమైన ఆటసమయం - వుడ్‌వార్డ్స్ వల్లనే

పట్టునొప్పి, పుల్లదనం, కడుపు ఉబ్బరం, పళ్లుచేయునపుడు కలిగే జబ్బులకు, వాడేది

వుడ్‌వార్డ్స్' గ్రైప్ వాటర్

తెలివైన తల్లులు 100 ఏళ్ల నుంచి వాడుచున్నారు.

Aiyars ATC-486-TEl

సుఖం ఎరుగని జీవితం

కుటుంబమునకు దూరమై అమరేంద్రతో వెళ్లి పోయింది.

ఆమె జీవిత సర్వస్వంగా భావించి, లక్షలాది ఆస్తిని కాలదన్ని పవిత్ర ప్రేమను ఆదర్శంగా పెట్టుకొని, ఆమెతోపాటు వచ్చిన అమరేంద్రను విడిచి ఈనాడు శ్రీధరంను చేపట్టింది.

జీవితంలో అంతూ, పొంతూలేని సుఖాన్ని చవి చూడాలని ఆమె కాంక్ష. మామయ్య ఈనాటికీ కుమిలి పోతాడు పార్వతిలేని వెలితికి. సామాన్య, కుటుంబీకుడయి నప్పటికీ, సాధ్యమయినంత వరకు ఉన్న వాటిలో మంచి సంబంధం చూట్టానికి ఆయన ఎప్పుడూ వెనుకంజ వేసేవాడు కాదు. ఇప్పటికీ ఆయనకు ఆమె మీద గల అభిమానం ఈ విషయానికి నిదర్శనం. సక్రమంగా ఆయనింట్లో ఉంటే సలక్షణముగా పార్వతి వివాహము జరిగి పోయేది.

బాల్యస్నేహితుడు శంకరం సిగ్గు విడిచి అడిగాడు 'ప్రేమిస్తున్నాను' అని. అతనికేం తక్కువ — అందం, చదువు, సంస్కారం — అన్నీ కలవాడు. కాని నిర్లక్ష్యంగా తృణీకరించింది — 'ఇంత తేలికగా హృదయాన్ని అమ్మకునే అసమర్థుడవనుకోలేదు.' అని వెంకిగా అంటూ — పాపం, అతను అవమానం భరించలేక ఇల్లు విడిచి మిలటరీలో చేరిపోయాడు.

లక్షాధికారి అమరేంద్ర ఈమెను నమ్మి ఈనాడు దమ్మిడీ ఎత్తు విలువ చేయకుండా పోయాడు. తనకు వచ్చే జీతంలో ఆమెను తృప్తి పరచలేక పోయానని బాధపడే అమరేంద్రను ఆమె ఏనాడూ అర్థం చేసుకోలేదు. పైపెచ్చు అతనికి తనపై మోజు తగ్గిందని వూహించుకొంది. స్థిమితమైన ఆలోచనలు లేక అల్లుకున్న ఈ వూహలే, బహుశా, ఆమెను పెడత్రోవ తొక్కించి ఉంటాయి.

అనుభవించే 'గీత' అందరికీ ఉండాలంటారు. ఆ 'గీత' లేక పోవడం మూలకంగా కాబోలు పార్వతి ఈనాటి వరకు జీవితంలో స్థిరపడ లేక పోయింది.

తరచు శ్రీధరం గారింటికి వెళ్లే వాడిని. గమనించిన విశేషం ఏమిటంటే పార్వతి ప్రవర్తనలో మార్పు. పరిస్థితిని అర్థం చేసుకొని మెలగడం నేర్చుకుంది ఆమె. వ్యక్తుల స్వభావాన్ని నిర్మల హృదయంతో చదువ సాగింది. వల్లమాలిన 'లక్ష్యం' ఆమెలో ఇమిడి పోయింది. కనుకనే పొరపొచ్చాలు లేకుండా వారి దాంపత్య జీవితం నడిచి పోతోంది. శ్రీధరంగారు భార్యను పువ్వులలో పెట్టి పూజిస్తున్నారంటే ఆశ్చర్య పడవలసిన అగత్యం లేదు.

" బావగారు మా అబ్బాయికి కట్నం ఎంత ఇస్తారు ? .... ఎందుకయినా మంచిది ఇప్పుడే తేల్చి చెప్పండి " నవ్వుతూ అనేవారు ఆయన.

పార్వతి సిగ్గుతో కుంచించుక పోయేది. మొదట్లో అర్థం కాకపోయినా దరిమిలా అర్థం చేసుకున్నా పార్వతి గర్భవతి అని. ఈ విషయానికి సంతోషించ తగ్గ ఆప్తుడను ఆమెకు, ఇక్కడ నేనొక్కడనే. పార్వతి నాలుగు కాలాలపాటు సుఖంగా వర్ధిల్లాలని మనసులో దైవాన్ని అర్థించాను.

చక్కని పార్వతి సంసారాన్ని ఎక్కువ కాలం తిల

కించే అవకాశం లేకపోయింది. హఠాత్తుగా శ్రీధరం గారికి ఉద్యోగరీత్యా బదిలీ కావడంతో వాళ్ళకు దూరం కావలసిన అగత్యం ఏర్పడింది. మొదట్లో నిరుత్సాహ పడ్డాను. బిగువైన సన్నివేశాలతో, రసవత్తరముగా నడుస్తున్న సినిమా మధ్యలో కరెంటు ఆగితే ఎట్లా వుంటుందో ఆ విధంగా ఫీలయ్యాను. విధి నిర్ణయం, తప్పుతుందా మరి. కన్నీళ్ళతో వీడ్కోలిచ్చాను.

"రాజూ ! కావలసిన వాడివి, నిన్ను దూరం చేసుకోవాలంటే నా మనస్సెంతో క్షోభిస్తుందిరా. ఏం చెయ్యను ? ...... దైవ నిర్ణయాన్ని తోసిపుచ్చ గలమా ? ...... నువ్వెక్కడ వున్నా నీ కోసం పరితపించే ఈ చెల్లెల్ని మాత్రం ఎన్నడూ మరువకుండా ఉంటావని నమ్ముతున్నాను" అంది కన్నీరు మున్నీరుగా విలపించుచూ.

ఎంత ఆపుకుందామనుకున్నా నాకు కన్నీరు ఆగలేదు. జేబురుమాలుతో తుడుచుకున్నాను.

శ్రీధరంగారుతో కాస్సేపు మాట్లాడిన తరువాత "ఒరేయ్ అన్నయ్యా ! నాకు తెలియకుండా పెళ్లి చేసుకున్నావో మళ్ళీ సత్యాగ్రహం, పికెటింగు వగైరా, వగైరా గుర్తుంచుకో." అంత ఏడ్పులోనూ నవ్వ గలిగింది పార్వతి.

"శ్రద్ధగా చదువు. లేకపోతే గాంధీగారి క్లాసు — అదే — మూడు గీతల కంపార్టుమెంటు." ఆఖరి సారిగా ముగ్గురం నవ్వుకున్నాము. అనుబంధాలను తెంచడమే విధిగా పెట్టుకొన్న 'జి. టి. ఎక్స్‌ప్రెస్' రావడమేకాక 'నీలెక్కేమిటన్నట్టు' వారిని కూడా తనవెంట తీసుకొని పోయింది. నీరసంగా నడుస్తున్నాను.

నిర్మల మయిన ఆకాశం. ఉధృత మయిన చలిగాలి. తన ఉనికిని తెలియజేద్దామని విఫలమవుతున్నాయి. మొత్తం మీద చలి ప్రభావం అధికంగా ఉంది. అంత ఎండలోనూ వణుకు పుట్టుకొస్తోంది. ఉత్తర దేశంలో చలికి దక్షిణాది మానవుడు దడుసుకోవలసిందే. సమయానికి చిక్కిన 'సిటీ బస్'లో ఎక్కి కూర్చున్నాను. చల్లగా ఉన్న పరిసరాలను బస్ కిటికీ ద్వారా నిర్లక్ష్యంగా చూశాను. చటుక్కున ఆంగ్ల కవి షెల్లీ వాక్యాలు గుర్తుకు వచ్చాయి.

"శీతాకాలం వచ్చినంత మాత్రాన వసంత కాలం రాకుండా ఉంటుందా ? ....." ఈ వాక్యాలు "పార్వతి నిత్యజీవితంలో ఆచరణలోకి వస్తాయా ?" వస్తే బాగుండునని అనుకొన్నప్పుడు హృదయం తేలిక పడింది.

పార్వతి ఇంతకు ముందు సాఫీ అయిన బ్రతుకు పొందలేదు. అర్థంలేని సన్నివేశాలతో అనుకోని సంఘటనలతో ఆమె వెనుకటి జీవితం జరిగి పోయింది. శ్రీధరం సాంగత్యంలో ఇప్పుడిప్పుడే ఒక దారిన పడుతోంది.

"సాఫీ అయిన బ్రతుకును ఆమెకు ఎల్లకాలం ప్రసాదించు భగవాన్ !" చేతులు జోడించి భగవంతుని ప్రార్థించాను మనస్ఫూర్తిగా.

* * *

హైద్రాబాద్‌లో లెక్చరరుగా స్థిరపడి పోయాను. దూరంగా ఉన్నప్పటికి పార్వతితో ఉత్తరాల సంబంధం పోలేదు. నేను వూహించిన పార్వతి భావిజీవితం తారుమారు అయింది. శ్రీధరం చాల మారి పోయాడట ! అతనిలో మానవత్వం నశించిందని, 'పంచె— చెడూ' అన్న ఇంగిత జ్ఞానం లేకుండా పోయిందని పార్వతి ఉత్తరాలలో చెప్పుకొని ఏడ్చేది.

మళ్ళీ కష్టాలకు ఎర అయింది ఆమె.

నేను కంట తడిపెట్టా— అకస్మాత్తుగా ఆమె జీవిత పథంలో తిరిగిన ఈ మలుపుకు సార్థకమయిన బ్రతుకుకొరకు, లోకం మెచ్చతగిన స్థానం కొరకు ప్రాకులాడే పార్వతి ఆశలు ఎండ మావులుగా నిలచిపోయాయ్. ఇంటికి వచ్చిన నేను పార్వతి వ్రాసిన ఉత్తరము చూసి స్తంభీభూతుడ నయ్యాను. తెప్పరిల్లి వణుకుతున్న చేతులతో చదువసాగాను !

'రాజూ !'

హృదయాన్ని కలచివేసే బాధను ఆప్తులకు, అర్థం చేసుకో కలిగిన వాళ్ళకు చెప్పుకుంటే ఒక విధమయిన ఉపశమనం కలుగుతుందంటారు. ఓర్పుగా వినకలిగిన వాడవు నీ ఒక్కడవే ! కనుక నా నిస్సార జీవితాన్ని నీకు తెలియజేస్తాను.

ఒకసారి, పెద్ద ఆఫీసరొకరు టెలిఫోన్లో తన గుమాస్తా మీద చీవాట్లు వేస్తున్నారు.

"ఈ టెలిఫోను చివర నున్న వాడు ఇంత అప్రయోజకుడని నే నెన్నడూ అనుకోలేదు." అన్నాడాయన.

గుమాస్తా వెంటనే అందుకొని "ఏ చివరసార్" అని ప్రశ్నించాడు.

రవిబాబు (విజయవాడ)

ఎవ్వరినీ, లక్ష్య పెట్టకుండా, దేనిని లెక్క చేయకుండా, పాపభీతి అనేది లేక సంచరించిన సంవత్సరాలు నా జీవితంలో ఉన్నాయి. స్వర్గ తుల్యమయిన బ్రతుకును కాంక్షించి, స్థిమిత మయిన ఆలోచనలు లేక పోవడంతో, కొరగాని పనులెన్నో చేశాను. కాని ఫలితం !— సాఫీ అయిన జీవితం అంటే ఏమిటో తెలియకుండా పోయింది.

అనుభవించతగ్గ యోగ్యత ఉండీ కూడ, తెలివిమాలి వచ్చిన అవకాశములు జారవిడచాను. నా చేష్టలకు.... బలిఅయ్యారు కొంత మంది అమాయకులు ! అప్పట్లో వాళ్ళ గురించి ఆలోచించవలసిన అవసరం నాకు కలగలేదు. నాకు, నేనుగా ఏ వ్యక్తిని సానుభూతితో అర్థం చేసుకోలేక పోయాను. అది ఆ నాటి నా బలహీనత.

కొంత కాలానికి పశ్చాత్తాపం పొందాను. తత్ఫలితంగా నాలో మార్పు వచ్చింది. క్రమంగా పరిస్థితులకు అనుకూలంగా ప్రవర్తించడం నేర్చుకున్నాను.

భర్త అయిన శ్రీధరం గారిని దైవాన్ని కంటె ఎక్కువగా ఆరాధించాను. ఆ విధంగా చేయడంతో ఒక విధమయిన సంతృప్తిని పొందకల్గాను.

"నీ దెంత నిష్కల్మష హృదయంరా ? !"
—నిజంగా నేను ధన్యుడ్ని అనేవారు ఆయన.

ఆయన సుఖం, ఆనందం నావిగా ఎంచి పట్టుదలగా, ధైర్యంతో సంసార సాగరాన్ని ఈదడానికి, నా గమ్యమును చేరడానికి యత్నించాను.

అందుకు అవరోధంగా నిలచింది మోహిని. కాలేజీ రోజులలో శ్రీవారికి మోహిని సహాధ్యాయినట. క్రమంగా ఆమె.... చుట్టమై చూడ వచ్చిన ఆమె.... శత్రువుగా మారి నాపై కత్తి కట్టింది. మావారిని ఆకర్షించి ఆయనను నాకు కాకుండా చేసింది. యోచించకుండా తప్పటడుగు వేసి విషవలయంలో చిక్కుకున్నారు ఆయన. వారికిప్పుడు మోహినితోడిదే లోకం. ఆమె సాంగత్యములో, అనేక దుర్వసనాలకు లోనయ్యారు. అడగడానికి నాకు అధికారం లేదు. 'నువ్వెవరవు?' అన్న ప్రశ్న ఎదురు అవుతోంది.

గుట్టుగా జరుగుతున్న మా కాపురం బజారుపాలయ్యింది. సంసారం ఛిన్నా భిన్నం అవుతోందని తెలుసుకునే శక్తి మా వారిలో నశించి పోయింది.

భర్తను దైవాన్నిగా భావించి ఆయన నీడలో తల దాచుకుందామని ఉవ్విళ్ళూరులాను నేను.

జీవిత నాటకంలో నిముషానికి ఒక రంగు మార్చి స్వలాభమునకు ఇతరులను నాశనం చేసే స్వభావము కలది మోహిని.

మా ఇద్దరిలో కల తారతమ్యతను గుర్తించ కలిగిన స్థితిలో లేరు మీ బావ. తాగిన మైకంలో ఇష్టం వచ్చినట్లు బాది, చెప్పకుండా ఇల్లు విడచి ఏ ఐదారురోజులకో వచ్చేవారు.

ఏ చేతులతో ఎత్తుకొని ముద్దాడేవారో అవే చేతులతో నా బాబును, మా పవిత్ర ప్రేమకు చిహ్నంగా నిలిచిన్న ఆ పసికందును దూరంగా తోసేవారు. అక్కడికి 'రోజులు మంచివికావని' సహనంతో ప్రవర్తించాను.

ఆడదానికి తోటి ఆడదే శత్రువు అన్న విషయం నా పట్ల నిజంగా రూపొందింది. మోహిని నన్ను హత్య చేసే ప్రయత్నాలు కూడ చేస్తున్నదని చూచాయగా గ్రహించగల్గాను.

'జీవచ్ఛవం'లా బ్రతుకడమే కాక దిక్కుమాలిన చావుకు కూడ నోచుకోవడం నా కిష్టం లేదు. అందుకనే నా అంతట నేను శాశ్వతంగా ఈ లోకం నుంచి నిష్క్రమించదలచాను.

నా బాబును అయినా కనీసం మోహిని కనికరిస్తే కొంత ఆత్మ శాంతిని పొందుతాను.

జీవితంలో చెడుగాను, మంచిగాను ప్రయత్నించి, తుట్ట తుదకు ఏ మార్గంలోను గమ్యాన్ని చేరలేక పోయాను.

పరాజితను !— నన్ను క్షమించు.

పార్వతి

ఏడ్చి, ఏడ్చి నా గుండెలు అలిసి పోయినాయ్. నిస్సహాయుడైన పార్వతి అన్నయ్య అంతకంటె ఏమి చేయలేడుగా !

మంచిగాను, చెడుగాను ప్రవర్తించి ఈ లోకం ఎవరి మన్ననకు పాత్రురాలు కాలేకపోయింది.

ఆమెది సుఖం ఎరుగని జీవితం !